స్వకృషి
సహకార ఉద్యమం

# స్వకృషి మహిళా పొదుపు సంఘాల సహకార పాటలు




సహకార వికాస సంస్థ

సహవికాస కాలనీ, చింతగట్టు క్యాంపు వద్ద, వరంగల్ - 506 015, తెలంగాణ

ఫోన్: 0870-298-2744

ఈమేల్: office@cdf-sahavikasa.net వెబ్‌సైట్: www.cdf-sahavikasa.net


సహవికాస/CDF

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | అమ్మా మా పొదుపు సంఘమా .... | . . . | 1 |
| 2. | అమ్మా పొదుపు సంఘమా .... | . . . | 2 |
| 3. | అడుగుదాం ఓయక్కా.... | . . . | 3 |
| 4. | ఇంటింటా దీపమై .... | . . . | 5 |
| 5. | ఊరులున్న పేద సాద ... | . . . | 6 |
| 6. | చిన్న బోయి కూర్చున్న .... | . . . | 8 |
| 7. | చెయ్యి చెయ్యి పదవికి .... | . . . | 9 |
| 8. | చేయి చేయి కలుపుదాం .... | . . . | 10 |
| 9. | జయ జయహే పొదుపు తల్లి .... | . . . | 11 |
| 10. | జయం జయం .... | . . . | 13 |
| 11. | నేతలంటె ఎట్ల ఉండాలంటే .... | . . . | 14 |
| 12. | పండుగ వచ్చింది పండుగా | . . . | 15 |
| 13. | పల్లె పల్లెలో పొదుపు ఉద్యమం .... | . . . | 16 |
| 14. | పల్లెలు పట్నాలలోనా ఓయక్కా .... | . . . | 17 |
| 15. | పొదుపు ఉద్యమ నాయకులారా .... | . . . | 19 |
| 16. | పొదుపు ఉద్యమ పోరును .... | . . . | 20 |
| 17. | పొదుపు చేయగా ముందుకు రావె ...... | . . . | 21 |
| 18. | మహోవరం మాకువరం .... | . . . | 22 |
| 19. | సభ్యులారా స్వాగతం .... | . . . | 23 |
| 20. | సహకార ఉద్యమంలో .... | . . . | 24 |
| 21. | స్వకృషి ఉద్యమానికి .... | . . . | 25 |
| 22. | స్వకృషి ఉద్యమ సారథులారా .... | . . . | 27 |
| 23. | స్వాగతాలు స్వాగతాలు .... | . . . | 28 |
| 24. | స్వాగతాలూ స్వాగతాలూ | . . . | 29 |
| 25. | స్వాగతాలూ స్వాగతాలమ్మా .... | . . . | 30 |

# అమ్మా మా పొదుపు సంఘమా ....

పల్లవి: అమ్మా మా పొదుపు సంఘమా వందనాలు అమ్మా
మా బ్రతుకుల్లోనా వెలుగులు నింపినతల్లివి నీవమ్మా
ఊరువాడను ఒక్కటి చేసిన చరిత్ర నీదమ్మా
ఈ ధరిత్రిలోన నిన్ను నమ్మితే లోటే లేదమ్మా ॥అమ్మా॥

చరణం 1: పల్లెపల్లెలో పొదుపు దీపమై వెలుగుచున్నవమ్మా
ఆ వెలుగుబాటలో సకలజీవులం బ్రతుకుచున్నమమ్మా
వయస్సు మీదనే పైసపైసను పొదుపు చేయమన్నవ్
ఆ పొదుపే నీకు వృద్ధాప్యంలో తోడునీడ అన్నవ్
నీవే మాకన్న తల్లివి మమ్ము కాపాడే కల్పవల్లివి (2)
పుట్టిన నుండి గిట్టే వరకు నువ్వు లేనిదే ఏది జరగదు ॥అమ్మా॥

చరణం 2: పొదుపు సంఘంలో రాజకీయము తగదని అన్నావు
స్వశక్తితోనే సంఘ సభ్యులు ఎదగాలన్నావు
రారాజైన నిరుపేదైన పొదుపె జీవమన్నవ్
మోసం చేసి బ్రతుకుటకన్న చచ్చుట మేలన్నవ్
పరుల సొమ్ము పాముపంటిది పడగనీడన పడవద్దన్నవ్ (2)
నిజాయితే మన బలమన్నావు నీతిగా బ్రతుకుటె విలువన్నావు
॥అమ్మా॥

చరణం 3: ఎందరెందరో సహకారులకు కలల తల్లివమ్మా
వాళ్ళు చూపినట్టి ఈ మార్గంలోనా నడుస్తున్నమమ్మా
జీవితాలనే త్యాగం చేసిన పుణ్యమూర్తులమ్మా
ఎన్ని జన్మలెత్తిన వాళ్ళ రుణం మేం తీర్చలేనిదమ్మా
అమరులైన ఆ త్యాగమూర్తులకు అడుగడుగున పాదాభివందనం (2)
స్వకృషి ఉద్యమ పోరులో వాళ్ళ ఆశయాలు సాధించుతం ॥అమ్మా॥

## 2. అమ్మా పొదుపు సంఘమా ....

పల్లవి: అమ్మా పొదుపు సంఘమా  పేదవాని దీపమా
అమ్మా పొదుపు సంఘమా సభ్యుల కలకు రూపమా
వందనాలు వందనాలమ్మో మా పొదుపుల తల్లి
వందనాల చందానాలమ్మో మాదయగల తల్లి ॥అమ్మా॥

చరణం 1: ఎండనకా వాననకా ఆరుగాలములు కష్టపడుతూ
ఆకలి డొక్కలు ఎండగట్టుకొని పైసాపైసా కూడబెడుతూ
రేపటి ఆశల భవిష్యత్తు కోసం సంఘంలో పొదుపు చేస్తున్నాం
అవసరానికప్పు దొరికిన రోజు చేసిన కష్టం మరిచెదమమ్మా
ఆశలు మావి తీరాలనీ మీ చల్లని దీవెనలివ్వాలమ్మా ॥అమ్మా॥

చరణం 2: బయటి అప్పుల జోలికి పోయి దగాపడిన బతుకులు మావి
అవసరానికి అప్పులు ఇచ్చి ఆదుకునేటి చల్లని తల్లి
సరసమైనా వడ్డేనమ్మా తేలికైన కిస్తులూ అమ్మా
సంపాదించిన దానిలోన మొదటి చెల్లింపూ సంఘానికే
పస్తులు మేము ఉన్నాకానీ కిస్తూ బకాయి ఉండమే అమ్మా ॥అమ్మా॥

చరణం 3: సభలూ సమావేశాలకు, ఖర్చు దండిగా చేయొద్దమ్మా
ఉద్యోగులు గొంతెమ్మ కోరికలనూ కోరొద్దమ్మా
పర్యవేక్షకులు భృతిపొంది నిధులను కాపాడాలమ్మా
పాలకవర్గం భృతిపొంది సంఘాన్ని నడిపించాలమ్మా
పైసా ఖర్చు చేసే ముందు మా పస్తులు గుర్తుకు రావాలమ్మా ॥అమ్మా॥
సహకార చందానాలమ్మో మాదయగల తల్లీ (3)

# 3. అడుగుదాం ఓయక్కా....

పల్లవి: అడుగుదాం ఓయక్కా బయలుదేరిరా
బృందంలో సభ్యురాలు బకాయుండెనూ
బృందంలో సభ్యులై బకాయిపడినాక
బృందం విలువేముంది పద్ధతి ఏమైంది ॥అడుగుదాం॥

చరణం 1: అప్పును ఇప్పించుటకు జామీనిచ్చీ
తరువాత పట్టింపు చేయలేదులే
నన్నడిగేవాల్లూ ఎవరూ లేరనుకొని
అలుసు దొబ్బి సభ్యురాలు బకాయిపడెనూ
బకాయి పడటమేమొ ఒక్కరి తప్పూ
అడగకుండ వదిలేస్తే నలుగురి తప్పు ॥అడుగుదాం॥

చరణం 2: ఒక్కనెల బకాయని ఊరుకొని చూస్తుంటే
మొండి బకాయిగా మారి మన కొంప ముంచెను
అప్పుతాను కట్టెదాకా మనకప్పురాదులే
ఆలస్యం చేసామా మన సంఘం ఊరుకోదు
మన పొదుపులు పోతాయి మన పరువు పోతుంది
మన కాసర ఉండేటి సభ్యత్వం పోతుంది ॥అడుగుదాం॥

చరణం 3: నీకవసరమున్నదనీ అప్పుకోరితే
తోటి సభ్యులని నీకు జామీనిస్తే
ఏరుదాటినాక తెప్ప తగలేసినట్లు
అవసరం తీరినాక బకాయిపడినావు
బకాయీపడ్డ సొమ్ము తక్షణమే చెల్లించి
బృందం నుండి బయటికి దయచేయండి ॥అడుగుదాం॥

చరణం 4: సంఘంలో నువ్వు బృంద సభ్యులుగా కొనసాగుతు
పద్ధతులు పాటించక విలువెందుకు కోల్పోతవు
బృందంలో సభ్యులై బకాయిపడితే
నిలదీయనప్పుడు బృందమెందుకు
చిన్న పామునైనగాని పెద్ద కర్రతో కొట్టాలి
ఒక్కనెల బకాయైన నిలబెట్టి అడగాలి ॥అడుగుదాం॥

## 4. ఇంటింటా దీపమై ....

పల్లవి: ఇంటింటా దీపమై – అదే పొదుపు రూపమై
మన బ్రతుకులు వెలిగిస్తుంది – మునుముందుకు నడిపిస్తుంది
॥ఇంటింటా॥

చరణం 1: ఒక్కరితో మొదలవుతుంది ఎక్కడికో ఎదిగేస్తుంది
అక్కున నిను చేర్చుకుంది – ఆదుకుంటా నంటానంది
చేయి చేయి కలపమన్నది – చేయి చాచి అడగకన్నది
అండగా నేనున్నానంటూ – పొదుపు నెపుడు మరవకు అంటూ
॥ఇంటింటా॥

చరణం 2: అమ్మలంత అక్కలంత చేరరండి పొదుపుల చెంత
ఉండదమ్మ జీవితానికి – ఏనాడు మీకు చింత
బయటప్పులు చేయొద్దమ్మా – బాధలను మోయొద్దమ్మా
సంఘం నీవెంటొస్తుందీ – సమస్యలను తీరుస్తుంది
॥ఇంటింటా॥

చరణం 3: ఎదిగే మీ పిల్లలచదువుకు మీ పొదుపే తోడవుతుంది
చక్కని మీ కాపురాలకు చిక్కులు రానీయనంది
మనో బలం పెంచుతున్నది మంచిగ నిను బ్రతకమన్నది
అదే మీరు చేసే పొదుపు కష్టాలను చేయును అదుపు ॥ఇంటింటా॥

చరణం 4: పొదుపు చేసే ప్రతీపైసా జీవితాన చిరుగుల ఆశ
తొలిపొద్దై ఉదయిస్తుంది – చీకట్లను తొలగిస్తుంది
ఒకటి ఒకటి రెండవుతుంది – అదే పెద్ద కొండవుతుంది
అందమైన జీవితానికి పొదుపు సంఘ మండవుతుంది ॥ఇంటింటా॥

చరణం 5: పొదుపు నిన్ను చెయ్యమన్నది – అప్పు నిన్ను పొందమన్నది
మన ఆర్థిక అవసరాలనూ – వెనువెంటనే తీరుస్తుంది
సమావేశమవ్వమన్నది – అప్పు ఎంతో అడగమన్నది
చర్చలన్ని చేసినాకె సిఫారస్సు చెయ్యమన్నది ॥ఇంటింటా॥

## 5. ఊరులున్న పేద సాద...

పల్లవి : ఊరులున్న పేద సాద పొదుపు చేస్తమన్నరు
సంఘంలుంటమన్నరు
సహకార ఉద్యమంలో భాగస్వామినన్నరు
మేం బాగుపడ్తమన్నరు
చేయి చేయి కలిపి మాది చైతన్యం అన్నరు
పేదరికం పోవాలన్నరు
నోటునోటు కూడబెట్టి కోట్లు జేస్తమన్నరు
మా పాట్లు తీర్తమన్నరు ॥ఊరులున్న॥

చరణం 1: మహాసభ పెట్టుకొని కమిటీ నెన్నుకున్నరు
సంఘ పాలన చేయమన్నరు
నెలనెలా సభ్యులంత డబ్బుకట్టాలన్నరు
మరి తేది తప్పద్దన్నరు
సహకార సూత్రాలను పాటించాలన్నరు
మరి మాట తప్పద్దన్నరు
కులమతాలు రాజకీయం చెల్లనివ్వమన్నరు
మరి దరిచేరొద్దన్నరు ॥ఊరులున్న॥

చరణం 2: సంఘ మందు పొదుపులకు బోనస్సు వస్తుఉంటది
మనకు ఇన్సురెన్సు ఉంటది
రైతులంత పొదుపు జేస్తె పెట్టుబడికి ఉంటది
వాళ్ళకాసరాగా ఉంటది
చిన్నా చిన్నా బిజినెసోల్లు చితికి పోవద్దన్నరు
మరి పొదుపు చేయాలన్నరు
కన్నతల్లిలాంటి సంఘం ప్రవేటప్పొద్దన్నది
మీ బాధలు తీర్తనన్నది ॥ఊరులున్న॥

చరణం 3: కూలినాలి చేసిన డబ్బు కూడ బెడ్తమన్నరు
డబ్బు పోగు చేస్తమన్నరు
నెలనెలా కూడబెట్టి లోను తీసుకుంటరు
వాల్ల బాకీ తీర్చుకుంటరు
గొర్రో బర్రో కొనుక్కోని సాదుకుంటమంటరు
పాలమ్మి బతుకుతుంటరు
బ్రతుకు జూపిన పొదుపు సంఘంను చల్లంగుండాలంటరు
భవిష్యత్తు ఉండాలంటరు ॥ఊరులున్న॥

# 6. చిన్న బోయి కూర్చున్న ....

రచన: **శ్రీ కె సమ్మయ్య**

గొల్లపల్లె

పల్లవి : చిన్నబోయి కూర్చున్న ఓ రైతు మహిళా
కష్టాలు ఎప్పటికి ఉండబోవమ్మ
చిన్న చిన్న పొదుపుచేసి చూడవోయి మాయమ్మ
పొదుపు మహిమ తెలుసుకోనీ మొదలు పెట్టవమ్మ

చరణం 1: ఆలు పిల్లలతోటి అలమటించెకన్న
పొదుపు చేస్తె కష్టాలు కడ తేరునమ్మ
కష్టాలు ఎప్పటికి కబలించునమ్మ
పొదుపు చేసి బతుకునే మార్చుటయే మిన్న ॥చిన్న॥

చరణం 2: సంసార జీవితమే సాగరమోయమ్మ
ఎదురీత ఈదకుంటే మునిగి పోదువమ్మ
తలరాత మార్చుటకు సాటి ఏదమ్మ
పొదుపూ లేకపోతే జీవితమే సున్న ॥చిన్న॥

చరణం 3: నారుపోసి నీరు పెట్టి పైరునెదగదీసి
పైరు పచ్చగ చేసి పంటను పండించి
పావలా పొదుపు చేయక ఎండిపోయే బతుకు
కొండలైన పిండగును పొదుపు చేసుకుంటె ॥చిన్న॥

చరణం 4: పల్లెపల్లె పొదుపు బాట ప్రగతికేనమ్మ
స్వకృషి ఉద్యమమే పొదుపు బాటనమ్మ
స్వయం సమృద్ధియే స్వాతంత్ర్యమమ్మ
సహకార మందించి వెలుగు పంచవమ్మ ॥చిన్న॥

# 7. చెయ్యి చెయ్యి పదవికి ....

రచన : **శ్రీ యం రవి**
మక్తుంపురం

పల్లవి:
చెయ్యి చెయ్యి పదవికి న్యాయమన్న చెయ్యి ] (2)
చెయ్య లేకపోతే నువ్వు రాజీనామ చెయ్యి
ఏది చెయ్యకుండ నువ్వు సాకులెన్నో చెప్పకు
పాలకవర్గానిది పరువు నువ్వు తియ్యకు ॥చెయ్యి చెయ్యి॥

చరణం 1:
సమావేశ సమయానికి హాజరింక కావులే ] (2)
సమావేశం ముగిసెవరకు నువ్వు ఉండవు
ఎందుకొచ్చినావో ఇంక నీకు తెలియదాయే
ఎందుకు పోతున్నవో మాకు తెలియదాయే ॥చెయ్యి చెయ్యి॥

చరణం 2:
నివేదిక చదువుతుంటే చూడనైన చూడవు ] (2)
సంఘ లెక్కలొక్కనాడు అడగనైన అడగవు
చర్చలేమి చెయ్యవు చెప్పింది వినవు
ఏంది ఈ పద్ధతంటే అన్ని తెలుసు అంటావు ॥చెయ్యి చెయ్యి॥

చరణం 3:
వచ్చి రెండు నిమిషాలు గడువనన్న గడువదాయె ] (2)
గంట మోగినట్టు ఇంక సెల్లు ఫోను మోగుడాయె
సెల్లు ఫోను తీసి నువ్వు చెవ్వుకాడ పెడితే
సంఘమన్న సంగతే గుర్తు ఉండదాయె ॥చెయ్యి చెయ్యి॥

చరణం 4:
అర్జంటూ పని ఉందని ఆగలేను అంటావు ] (2)
సంతకమూ తీసుకోనీ ఫీజు ఇవ్వమంటావు
అప్పులన్న పంచె వరకు ఆగమని అంటే
అధ్యక్షులు గణకులె చూసుకోవాలంటావు ॥చెయ్యి చెయ్యి॥

చరణం 5:
పదవికోరి నీకునీవే పోటి చేసినావు ] (2)
మాయమాటలెన్నో చెప్పి ఓట్లులాగినావు
తీరపదవి వచ్చినంక తీరికే లేదంటే
రాజినామ పత్రము ఇవ్వడమే న్యాయమూ ॥చెయ్యి చెయ్యి॥

# 8. చేయి చేయి కలుపుదాం......

రచన: **శ్రీ యం ఎల్లయ్య**
నుస్తులాపూర్

పల్లవి : చేయి చేయి కలుపుదాం పొదుపు చేయ కదులుదాం
మనమంతా ఒక్కటిగా ఉన్నతి సాధించుదాం

చరణం 1: చుక్క చుక్క నీటి బొట్టు పెద్ద నదిగా మారురా
పెక్కు నదులు ఒక్కటయితే మహా సముద్రమవునురా
వ్యక్తి ఒక్కరే అయినా శక్తి తక్కువే అయినా
వ్యక్తి వ్యక్తి కలిసి మహా సంఘ శక్తి అగునురా ॥చేయి చేయి॥

చరణం 2: కార్మిక, కర్షక, శ్రామిక శ్రమ జీవులమంత కలిసి
పేదరికం తరిమివేసే ఆయుధంగ ముందు నిలిచి
కలిసి మెలసి పొదుపు చేసి సంఘంగా ఎదిగితే
నేటి పొదుపు రేపటి మన జీవితాన వెలుగునిచ్చు ॥చేయి చేయి॥

చరణం 3: అనుక్షణం స్నేహంగా నిస్వార్థ చెలిమిగా
బృందమె అనుబంధంగా ఐదుగురం ఆప్తులుగా
ఆపదలో బాసటగా ఒకరికి ఒకరం నిలిచి
సమిష్టిగా మనమంతా సంఘంలో జీవిద్దాం ॥చేయి చేయి॥

చరణం 4: అవసరాలు ఏవైనా ఆపదలు ఎన్నొచ్చిన
ఆడపడుచు పెళ్ళైనా వ్యాపారభివృద్ధికైన
అండగ మనకండగ మనకుండగ పొదుపూ సంఘం
ఆర్థిక అసమానతలను తరిమికొట్ట కదులుదాం ॥చేయి చేయి॥

చరణం 5: నియమాలను పాటించి నిబంధనలు ఆచరించి
తీసుకున్న అప్పులను సక్రమంగ చెల్లించి
తోటి సభ్యులకు తోడుగ మనమంతా తోడు నిలిచి
స్వకృషి సంఘాల ద్వారా ఉన్నతి సాధించుదాం ॥చేయి చేయి॥

# 9. జయ జయహే పొదుపు తల్లి ....

పల్లవి: జయ జయహే పొదుపు తల్లి జననీ ఇదె వందనం
సిరులిచ్చే మా తల్లికి విరులా జయవందనం
మనమంతా ఐక్యముగా సాగించే ఈ పయనం
మనసారా మా తల్లికి ప్రణమిల్లే శుభ తరుణం
జై పొదుపు తల్లి జై జై పొదుపు తల్లి (2) ॥జయ॥

చరణం 1: పైస పైస కూడబెట్టి - పొదుపులు చేయాలిరా
పొదుపు చేయలేనివారు -వెనుకబడి పోవునురా
పొదుపే మన జీవితాన సుఖశాంతిని నింపురా
పొదుపు బాటలోన నీవు ముందుకు సాగాలిరా
జై పొదుపు తల్లి జై జై పొదుపు తల్లి (2) ॥జయ॥

చరణం 2: అవసరాలు తీర్చేటి - అమ్మయె మన పొదుపురా
అమ్మ వద్ద పోగుచేసి - అక్కరకూ అడగరా
ఎప్పుడేమి అవసరమో ఎవ్వరికీ తెలియురా
అందుకనే నీవు ముందు జాగ్రత్తా పడుమురా
జై పొదుపు తల్లి జై జై పొదుపు తల్లి (2) ॥జయ॥

చరణం 3: పల్లె పల్లె మన సంఘం - ప్రమిదలు వెలగాలిరా
ప్రతి ఇంటా పొదుపు జ్యోతి - కాంతులు చిమ్మాలిరా
చేతనైన వరకు పొదుపు సంఘసేవ చేయరా
చేయి చేయి కలిపి నీవు పొదుపు బాట నడవరా
జై పొదుపు తల్లి జై జై పొదుపు తల్లి (2) ॥జయ॥

చరణం 4: ప్రింటెడ్ జమరశీదును -తప్పకుండ పొందురా
అప్పు నిల్వలను నీవు - తప్పక సరిచూసుకో
బకాయీ పడకుండా సక్రమంగా చెల్లించీ
నీ నిబద్ధతకు గుర్తుగ ప్రత్యేకప్పు పొందురా
జై పొదుపు తల్లి జై జై పొదుపు తల్లి (2) ॥జయ॥

చరణం 5: కనులముందు కనబడేటి సొమ్ము మనది కాదురా
మనది కాని సొమ్ము తింటే బతుకు బాగుపడదురా
సభ్యత్వం కోల్పోయీ బతుకు ఆగమవునురా
నిజాయితిగ నీతిగ మరి నీవు ముందుకెళ్ళరా
జై పొదుపు తల్లి జైజై పొదుపు తల్లి (2) ॥జయ॥

## 10. జయం జయం ....

పల్లవి: జయం జయం సదాజయం
సంఘ శక్తికీ జయం జయం
సహకారానికి జయం జయం

చరణం 1: నిరుపేదలను, నిర్భాగ్యులను
ఆదుకున్న సహకార వాదులకు
బలహీనులను, బడుగువారిని
ఒక్కటి చేసిన ఉద్యమానికి ॥జయం॥

చరణం 2: దోపిడి నుంచి దీనజనులను
కాపాడిన సహకార వ్యవస్థకు
అన్నదాతలకు, వృత్తి కులాలకు
సాయపడ్డ సహకార పరపతికి ॥జయం॥

చరణం 3: సభ్యులందరిని ముందుకు నడిపిన
పొదుపు సంఘముల ప్రోత్సాహానికి
సభ్యులందరికి విద్యాశిక్షణ
సమాచారమందించిన వారికి ॥జయం॥
సహకారానికి జయం జయం (3)

# 11. నేతలంటె ఎట్ల ఉండాలంటే ....

పల్లవి: నేతలంటె ఎట్ల ఉండాలంటే వేగుచుక్కలా ఉండాలమ్మా
ఉద్యమం వెలుగొందేలాగా కాంతిరేఖగ ఉండాలమ్మా

చరణం 1: సేవా చేసేటి భావం మదినిండా ఉండాలి
సమయాన్ని పాటించే సంస్కారం ఉండాలి
స్వతహాగ బాధ్యత గుర్తెరిగి ఉండాలి
నీతి, నిజాయితీకి ప్రతిబింబమవ్వాలి
సంఘంతో పాటు సమాజ శ్రేయస్సు
కోరుకునేటి తహతహ ఉండాలి ॥నేతలంటె॥

చరణం 2: ఆశయమన్నది ఎదనిండ ఉండాలి
గమ్యాన్ని చేరేటి లక్ష్యం ఉండాలి
సమస్యను తీర్చేటి నైపుణ్యం ఉండాలి
సవాళ్లనెదిరించె సామర్థ్యం ఉండాలి
ప్రజాస్వామ్యముగ పరిపాలన చేసి
సంఘీభావమును సాధించగలగాలి ॥నేతలంటె॥

చరణం 3: వేసేటి ప్రతి అడుగు ఆచితూచి వేయాలి
మాట్లాడే ప్రతి మాట ఖచ్చితంగా మాట్లాడాలి
చేసేటి పనులన్ని బాహటంగా చేయాలి
చెప్పిందే చేయాలి చేసిందే చెప్పాలి
చీకట్లు తొలగించే వెలుతురుగ మారాలి
సామాన్య జీవుల తలరాత మార్చాలి ॥నేతలంటె॥

చరణం: 4 నేతగ ముందుండి ఆదర్శమవ్వాలి
సభ్యులనెదిగించే చైతన్యముండాలి
విజయాన్ని పొందేలా ఉద్యమాన్ని నడపాలి
సాధన చేయాలి సాధించి తీరాలి
సహకార రంగానికి స్వకృషి సంఘాలు
ఎంతో ఆదర్శంగా నిలిచేలా చూడాలి ॥నేతలంటె॥

## 12. పండుగ వచ్చింది పండుగా

పల్లవి : పండుగ వచ్చింది పండుగా
మన ఊరీ స్వకృషి పండుగా
పేదల బ్రతుకులు పండగా
మరి వచ్చింది పొదుపుల పండుగా

చరణం 1: ఒకరికి ఒకరు తోడుగ నిలిచీ
సమస్యలన్నీ స్వయంగా తీర్చే
మరో ప్రపంచం వచ్చిందమ్మా
పొదుపుతోనే మొదలయ్యిందమ్మా ॥పండుగ॥

చరణం 2: బాధలున్నవని దిగులు చెందకూ
దీనబంధువు పొదుపు సంఘమూ
ఒకరికి ఒకరు తోడుగ నిలిచి
కష్టాలను పంచుకుందురు ॥పండుగ॥

చరణం 3: మానవత్వము దండిగా ఉన్నా
సభ్యులెందరో చుట్టు ఉందురూ
మానవసేవే మాధవ సేవని
సమాజానికి చాటుతున్నరూ ॥పండుగ॥

చరణం 4: సంఘం ఒక్కరి సొంతం కాదు
అందరు సమానమనేది సంఘం
అందరు సభ్యులు కూడారూ
అభివృద్ధికి పునాది వేసారూ ॥పండుగ॥

చరణం 5: కోరుకున్నది సాధిస్తూ
కొత్త ఒరవడి తెచ్చారమ్మా
మరో ప్రపంచం వచ్చిందమ్మా
పొదుపుతోనే మొదలయ్యిందమ్మా ॥పండుగ॥

## 13. పల్లె పల్లెలో పొదుపు ఉద్యమం ....

రచన: **శ్రీ యం ఎల్లయ్య**
నుస్తులాపూర్

పల్లవి : పల్లె పల్లెలో పొదుపు ఉద్యమం వచ్చెనె మాయమ్మా
ఆ ఉద్యమానికే అండదండగ నిలబడుదామమ్మా మనమూ నిలబడుదామమ్మా

చరణం 1: ఎందరెందరో జీవితాలలో వెలుగులు నింపింది
మన అందరి బ్రతుకులు మార్చుట కొరకు ముందుకు వచ్చింది
సంఘంలోని సభ్యులందరికి వరముగ మారింది
ఆ సభ్యులందరభ్యున్నతి కొరకు తోడుగ నిలిచింది ॥పల్లె పల్లెలో॥

చరణం 2: పొదుపు చేసె ప్రతి పైసకు సంఘం రక్షణ ఉంటుంది
మనకు ఆపద వచ్చిన వెంటనే సంఘం చేరువ అవుతుంది
సంఘాభివృద్ధికి సంఘ సభ్యులం అందరమొకటవుదాం
సభ్యులందరి భవితకు చక్కని వెలుగు రేఖలా ముందుందాం
॥పల్లె పల్లెలో॥

చరణం 3: ప్రేమా స్నేహం చైతన్యంతో అందరమొకటవుతాం
పొదుపు ఉద్యమాన్ని జయం చేయుటకు ముందుకు అడుగేద్దాం
పొదుపు అప్పు అసలు వడ్డీ ముందుగ చెల్లిద్దాం
మన సంఘ సభ్యులకు ఆదర్శంగా ముందుగ నిలబడుదాం ॥పల్లె పల్లెలో॥

చరణం 4: పొదుపు ఉద్యమం విజయాన్ని నలుదిశలా చాటిద్దాం
ఉద్యమాన్ని స్ఫూర్తితో మన ఆశయాలనే సాధిద్దాం
ఐకమత్యముగ సభ్యులమంతా ఉన్నతినే సాధించుదాం
విజయాన్ని మనము పొందుదాం సంఘాన్ని ముందుకు నడుపుదాం
॥పల్లె పల్లెలో॥

## 14. పల్లెలు పట్నాలలోనా ఓయక్కా....

పల్లవి: పల్లెలు పట్నాలలోనా ఓయక్కా.
పొదుపులు చేయగరారే మాయక్కా
పొదుపులు చేసిన మీకు ఓయక్కా
బంగారు బాటలు కాదే మాయక్కా
మనమంతా ఐక్యంగా సాగీ ఓయక్కా
ముందడుగు వేద్దాము రారే మాయక్కా
పొదుపుతల్లి బడిలోన మనమూ ఓయక్కా
పాఠాలు నేర్పుదాము రారే మాయక్కా ॥పల్లెలు॥

చరణం 1: ఒక్కొక్క వాన చుక్క ఒడిసి పట్టంగా
మన ఊరూ చెరువేమో నిండు చందంగా
ఒక్కొక్క సభ్యులేమో పొదుపులో చేరంగా
వందవేలు సభ్యులతో కళకళలాడంగా
అభివృద్ధి బాటలోన సంఘం నడవంగా
ఆనంద భాష్పాలు కన్నులు నిండంగా ॥పల్లెలు॥

చరణం 2: మట్టిలోన మానెడన్ని విత్తులు వేయంగ
పుట్లకొద్ది పంటలు పండూ చందంగా
వంద సంఖ్యల్లో నీవు పొదుపూ సేయంగా
లక్షల్లో సిరుల తల్లి ఇల్లు చేరంగా
పుడమి తల్లి మిన్ను కురిసి పంటలు పండంగ
పొదుపుతల్లి కళ్ళు తెరచి సిరులూ కురియంగా ॥పల్లెలు॥

చరణం 3: నెలవారి కిస్తులు నీవూ కట్టంగా
బృందంలో సభ్యురాలికప్పు దొరకంగా
తీసుకున్న అప్పులు చక్కగా కట్టంగా
ప్రింటెడ్ జమ రశీదు పొందుచుండగా
కట్టుబాటు ధర్మంతో సంఘం నడవంగా
పాలకవర్గం గణకులు కీర్తి పొందంగా ॥పల్లెలు॥

చరణం 4: తక్కువ వడ్డీతో అప్పులు పొందంగా
తాకట్టు లేకుండా ఎంతో సులభంగా
తలుపుతట్టి ఇంటికి లక్ష్మి చేరంగా
పరువూ మర్యాదలు మనకూ నిలవంగా
అమ్మలాంటి సంఘము మనమూ నిలపంగా
ఆర్థిక అభివృద్ధితో ధైర్యము కలగంగా ॥పల్లెలు॥

చరణం 5: నీతి నిజాయితీ నీకు ఉండంగా
సంఘాన్ని నడిపించె సత్తా ఉండంగా
ఇంటింటా మన పొదుపు సభ్యులు ఉండంగా
ఊరూరా పొదుపు జ్యోతి కాంతులు నింపంగా
చేయి చేయి కలిపి మనమూ నడపంగా
స్వకృషి ఉద్యమమూ ముందుకు సాగంగా ॥పల్లెలు॥

# 15. పొదుపు ఉద్యమ నాయకులారా .....

పల్లవి: పొదుపు ఉద్యమ నాయకులారా ఇది మా స్వాగతమూ
తరతరాల భవితకు పునాదులేసిన మీకు స్వాగతమూ
మా ఘన స్వాగతమూ ॥పొదుపు॥

చరణం 1: జీవన ప్రమాణ స్థాయి పెంపుకై పొదుపు ఉద్యమం నడిపించీ
సభ్యులె మనకు ప్రధాన భూమిక వారికి సేవలు అందించీ
జీవితాన మన పొదుపులె మిన్న పొదుపు లేని జీవితమే సున్న
సత్తువ ఉన్న రోజులలో కొంతైన పొదుపును చేయాలి ॥పొదుపు॥

చరణం 2: మచ్చలేని వ్యక్తిత్వం కలిగి మంచి నాయకులు అయినారు
సక్రమమైన దారిలో నడిచి మార్గదర్శకులు అయినారు
సంఘంలోన పెను సవాళ్ళను ధైర్యంతోను ఛేదించి
స్వకృషి పద్ధతులవగాహనకు నడుం బిగించీ నడిచారు ॥పొదుపు॥

చరణం 3: నీతికి నిలబడి నిజాయితీతో సంఘంలో పనిచేశారు
హక్కులతోను బాధ్యత కూడ సక్రమంగా నెరవేర్చారు
కుటుంబంలో యాజమానిలాగా మన సంఘులోన నడిచారు
కుటుంబ సభ్యుల మాదిరిగా మన సంఘు సభ్యులను చూశారు
॥పొదుపు॥

చరణం 4: ప్రతిఫలమూ ఆశించకుండా మీరిహర్నిశలు ఆరాటముతో
సంఘు క్షేమమును కోరే మిమ్ముల మరువదెన్నడు ఈ సంఘుం
మీరు వేసిన భవిత పునాదులు కలకాలం మీ కాంతి రేఖలో
సభ్యుల భవితే మారేటట్లు బంగరు బాటలు వేశారు ॥పొదుపు॥

## 16. పొదుపు ఉద్యమ పోరును ....

రచన: **శ్రీ పెంచాల రంగయ్య**
గట్టుదుద్దెనపల్లి

పల్లవి: పొదుపు ఉద్యమ పోరును నడిపే నేతల్లారా
మానవజాతి మనుగడకై పనిచేస్తూ ఉన్నారా
సమాజ మేలును కోరే శాంతిదూతల్లారా
స్వకృషి ఉద్యమ పోరుకు ఊపిరిమీరైనారా

మీకు దండాలు మీవాళ్లకు దండాలు
కోటి దండాలు శతకోటి దండాలు ॥మీకు॥

చరణం 1: పల్లెపల్లెలో పొదుపు ఉద్యమ
ప్రగతి రథానికి సారధులయ్యి (2)
ఎల్లవేలలా జనులందరిని
జాగృతపరిచే నేస్తాలయ్యి (2)
ఇల్లును విడిచి ఓ ఓ ఓ పిల్లల మరిచి హో హో హో
కష్టానష్టాలెన్నెదురైనా కష్టజీవులను ఒక్కటి జేసిన ॥మీకు॥

చరణం 2: ఐకమత్యమె మహాబలమని
బృంద సభ్యులను తయారుజేస్తు (2)
సమస్యలెన్ని ఉన్నాగానీ
సంఘ బాధ్యతలు భుజానమోస్తు (2)
పేదాగొప్పా ఓ ఓ ఓ తేడా లేకా హో హో హో
సంఘంలోని సభ్యులందరూ సమానమంటూ చాటి చెప్పిన ॥మీకు॥

చరణం 3 : పైసపైసను పొదుపూ జేస్తే
వృద్ధాప్యంలో తోడు ఉండునని (2)
బృంద సభ్యులె బంధువులయ్యి
ఆపదలో నిన్నాదుకుందురని (2)
నీతిగ ఉంటూ ఓ ఓ ఓ నిజాలు చెపుతూ హో హో హో
నిత్యం సత్యం పలుకుతు సంఘ నియమాలను పాటిస్తు ఉన్నా ॥మీకు॥

# 17. పొదుపు చేయగా ముందుకు రావె .....

పల్లవి: పొదుపు చేయగా ముందుకు రావె అక్కో ఓయక్కా
నీ బ్రతుకు దెరువుకు పొదుపు ముఖ్యమే అక్కోకూలక్కా ॥పొదుపు॥

చరణం 1: ఆపదలోన ఆదుకుంటది బ్రతుకు దెరువుకై బాట చూపుతది (2)
పైసలున్నవని పొదుపు ఎందుకని నిర్లక్ష్యం నువ్వు చేయొద్దక్కా (2)
బ్రతుకును మార్చగ పొదుపు చేయవె అక్కో ఓయక్కా
పొదుపుతోనె నీబాధలు తీరును అక్కోకూలక్కా ॥పొదుపు॥

చరణం 2: మనకు అండగా పొదుపు సంఘమె ఊరు ఊరుకు ఉన్నది అక్కా (2)
నెలకో యాభై రూపాయలను పొదుపు చేస్తే చాలును అక్కా (2)
సంఘంలో చేరి బ్రతుకు మార్చుకో అక్కో ఓయక్కా
నీ బాధలు అన్నీ తీరిపోవునే అక్కోకూలక్కా ॥పొదుపు॥

చరణం 3: అభయ నిధిలో అవకాశమున్నది అకాల మరణపు హామీ ఉన్నది (2)
అప్పులు పొందే అవకాశాలు నెలనెల కిస్తు చెల్లించవచ్చు (2)
పొదుపే ముఖ్యం పొదుపే సర్వం అక్కో ఓయక్కా
మన పొదుపు సంఘమును మరిచిపోకుమా అక్కోకూలక్కా ॥పొదుపు॥

చరణం 4: బిందువులన్ని పోగు జేసితే బిందెల నిండా నీళ్లైనట్టు (2)
నెలనెల మనము పొదుపు చేస్తే వృద్ధాప్యంలో అండగ ఉంటది (2)
చూసుకుంట నిర్లక్ష్యం చెయ్యకు అక్కో ఓయక్కా
పొదుపుతోనె మన బ్రతుకు మారునే అక్కోకూలక్కా ॥పొదుపు॥

# 18. మహావరం మాకువరం ....

పల్లవి : మహావరం మాకువరం మా పొదుపు సంఘమా
సుందరం సుమధురం సహకార సంఘమా
మరువలేము మరువబోము మన సమితి సేవలు
మరచిపోము మరువలేము సహవికాస సేవలు ॥మహావరం॥

చరణం 1: అప్పుకోరే సభ్యులా సమిష్టి బాధ్యత బృందం
బృంద సభ్యులైదుగురు బృంద సమావేశమై
తోటి సభ్యులా అప్పు సిఫారస్సు చేయగా
అప్పులనూ సులభముగా పొందే విధానము ॥మహావరం॥

చరణం 2: పొదుపులపై అప్పు పొంది అవసరమే తీరకుంటే
పొదుపు అప్పు వడ్డీలను సక్రమంగా చెల్లిస్తూ
క్రమశిక్షణతో సభ్యులు లావాదేవీలు చేస్తే
ప్రత్యేక అప్పునిచ్చి ఆదుకునే మన సంఘం ॥మహావరం॥

చరణం 3: అప్పుపొందిన సభ్యులు ఎవ్వరైనా మరణిస్తే
అప్పు భారమూ సభ్యులు, బృందంపై పడకుండా
సామూహిక పథకంలో సభ్యులనూ చేర్పిస్తే
పొందుదురూ నామినీలు విపత్సహాయ హామీని ॥మహావరం॥

చరణం 4: చిన్నా పెద్దాలంటూ తేడాలు లేనె లేక
సహకార ఉద్యమంలో సాగిపోయే సభ్యులార
ఆపదలెన్నొచ్చినా అండగ నిలిచే సంఘం
కష్టాలెన్నొచ్చినా కాపాడే మన సంఘం ॥మహావరం॥

# 19. సభ్యులారా స్వాగతం....

పల్లవి: సభ్యులారా స్వాగతం అందుకోండి సంఘం బరువూ బాధ్యతా మీదండీ
సంఘ పాలకులారా మరచీపోమూ మేము
నిస్వార్థం మీ సేవా నీతి నియమాల త్రోవ ॥సభ్యులారా॥

చరణం 1: సంఘ సేవను కోరీ స్వచ్ఛందంగా నడచీ
నీతి నిజాయితీ ధర్మం పునాదులయ్యి
భవిష్యత్తు బాటయ్యి బంగారు మాటయ్యి
నలుదిక్కుల వెలుగయ్యి పొదుపుద్యమముదయించే ॥సభ్యులారా॥

చరణం 2: పదవంటే అలంకారం కానేకాదూ నిజమూ
ప్రతిఫలమూ ఆశించే అవకాశమే లేదు
అంకిత భావంతో ఆదర్శంగా నిలచీ
చేయాలి సభ్యులమంతా స్వకృషి ఉద్యమ సేవా ॥సభ్యులారా॥

చరణం 3: సహకారం స్వావలంబన సమైక్యతా భావము కలిగి
తరాలకు చెరగని ముద్రగ మంచి పాలనా అందించీ
నైపుణ్యముతో కలిగిన విధానాలు అవలంభించీ
నవ సమాజదారులు వేసీ హర్షించే సేవలు జేసిన ॥సభ్యులారా॥

చరణం 4: పొదుపుద్యమ నాయకులారా పొదుపు ఆత్మబంధువులారా
పొదుపుతల్లి గూటికి చేరీ సంబరాల పండుగ చేసీ
సవాళ్ళను అధిగమించుతూ సలహాలను అందించాలి
జయము జయము ఉద్యమానికి జయహో పొదుపుద్యమానికి
॥సభ్యులారా॥

# 20. సహకార ఉద్యమంలో....

పల్లవి: సహకార ఉద్యమంలో మెరుస్తున్న సంఘమా స్వకృషి సంఘమా
వెలుగుతున్న సంఘమా సహకారుల సంఘమా

చరణం 1: మన పొదుపులతో మనకు అప్పులను అందిస్తూ
అవసరాలు తీరుస్తూ ఆర్థికంగా ఎదిగించే
మా పొదుపు సంఘమా స్వకృషి సంఘమా ॥సహకార॥

చరణం 2: వచ్చిన ఆదాయాన్ని బోనస్‌గా పంచుకుంటూ
మన లాభం మనదేనని నిరూపించిన సంఘమా
మా పొదుపు సంఘమా స్వకృషి సంఘమా ॥సహకార॥

చరణం 3: మా కొరకై మా పేరున ప్రగతి పొదుపులను చేసి
వృద్ధాప్యంలో మాకు అండగా నిలిచేటి
వెలుగుతున్న సంఘమా స్వకృషి సంఘమా ॥సహకార॥

# 21. స్వకృషి ఉద్యమానికి ....

పల్లవి : స్వకృషి ఉద్యమానికి సహకారమందించిన
పొదుపు ఉద్యమదారిలోన ఎనలేని సేవచేసిన
స్వాగతించి పిలుస్తున్నాము మన సహకారుల
పూజనీయుల గౌరవిద్దాము మన సహకారుల ॥స్వకృషి॥

చరణం 1: 64 చట్టములో అష్టకష్టాలనుభవించి
నేర్పుతోను చట్టములో లోపాలను గమనించి
95 చట్టం తెచ్చిరీ మన సహకారులు
సభ్యులాకు స్వేచ్ఛనిచ్చిరీ మన సహకారులు ॥స్వకృషి॥

చరణం 2: బీదబిక్కి బడుగు జీవులు షావుకార్ల దగ్గెరెల్లె
అప్పులకై అవస్థపడె అవసరమె లేదని
పొదుపు సంఘాలను పెట్టించ్రు మన సహకారులు
మరువలేని ముద్రవేసింద్రు మన సహకారులు ॥స్వకృషి॥

చరణం 3: గ్రామగ్రామాలూ తిరిగి పొదుపు ఉద్యమ వ్యాప్తికై
దారిద్ర్య రేఖకు దిగువనున్న సమాజంను
నిద్ర నుండి మేలుకొలిపింద్రు మన సహకారులు
అలుపెరుగని పోరుచేసింద్రు మన సహకారులు ॥స్వకృషి॥

చరణం 4: సభ్యత్వం తీసుకున్న సభ్యులే యజమానులని
సంఘానికి కట్టుబడె సభ్యులే ఇక ముఖ్యమనిరి
ప్రగతి పథంలో నడిపించింద్రు మన సహకారులు
మార్గదర్శకులై నిలిచింద్రు మన సహకారులు ॥స్వకృషి॥

చరణం 5: సక్రమమైన దారినడిచే పద్ధతులను నేర్పింఢ్రు
సమస్య వలయాలను నేర్పుతోను చేధించి
సవ్వాలనెదిరించింఢ్రు మన సహకారులు
సలహాలానందించింఢ్రు మన సహకారులు ॥స్వకృషి॥

చరణం 6: మరువలేము మరువబోము మీ ఆశయ పద్ధతీని
కంటికి కను రెప్పవోలె సంఘాలను చూసుకుంటాం
మీరు చేసిన కృషి ఫలితాలు మన సహకారులు
ఎన్నటీకి మరుపురానీవి మన సహకారులు ॥స్వకృషి॥

## 22. స్వకృషి ఉద్యమ సారథులారా ....

పల్లవి: స్వకృషి ఉద్యమ సారథులారా స్వాగతాలు మీకు
ముందు తరాలా వారధులారా వందనాలు మీకు మా వందనాలు మీకు

చరణం 1: పొదుపు బాటలో పొద్దు పొడుపులై
ఉద్యమానికే ఊపిరి మీరై (2)
నీతికి నిలబడె నిప్పు రవ్వలై
ఊరువాడలో వెలిగె దివ్వెలై (2)
సమాజ మేలును కోరె మీకు సలాము చేస్తున్నాము మేము సలాము చేస్తున్నాము
॥స్వకృషి ఉద్యమ॥

చరణం 2: స్వార్థం మరిగిన సమాజమ్ములో
నిస్వార్థమే నిజజీవితమనుకొని (2)
స్వంత లాభము కొంత మానుకొని
స్వకృషి ఉద్యమ పోరులో చేరి (2)
ఊరు వాడను ఏకం చేసిన ఉద్యమ నేతలు మీరు ఊరుకు ముద్దుబిడ్డలు మీరు
॥స్వకృషి ఉద్యమ॥

చరణం 3: కులము మతమను భేదం లేక
పేదా గొప్పను తేడా లేక (2)
పొదుపు లేనిదే బ్రతుకు లేదని
పొదుపు ఉద్యమ పోరులో చేరి (2)
ఎందరెందరి బతుకుల్లోన వెలుగులు నింపిన మీరు రేపటి వేగుచుక్కలవుతారు
॥స్వకృషి ఉద్యమ॥

చరణం 4: పవిత్రమైన పొదుపు బాటలో
కలిసి మెలిసి అడుగులు వేస్తూ (2)
ఎవ్వరి బాధ్యత వారే మోస్తూ
క్రమశిక్షణతో ముందుకు నడుస్తూ (2)
కష్టజీవుల సంపాదనకు కాపలదారులు మీరు రేపటి మార్గదర్శకులె మీరు
॥స్వకృషి ఉద్యమ॥

# 23. స్వాగతాలు స్వాగతాలు ....

పల్లవి: స్వాగతాలు స్వాగతాలు అతిథులకు స్వాగతం పాలకులకు స్వాగతం (2)

చరణం 1: సహకార సంఘమంటె ఒకరికి ఒకరం నిలచీ (2)
సంఘం, సభ్యుల కొరకు అహర్నిశలు పాటుపడే (2)
ఓర్పు, నేర్పు, నీతి, నియమాలే పునాదులై (2)
సభ్యుల అభ్యున్నతికి ఎనలేని సేవచేసే ॥స్వాగతాలు॥

చరణం 2: సహకార సంఘాలకు సభ్యులె యజమానులనీ (2)
నలుదిశలా చాటినా ఈ సంఘ పాలకులకు (2)
ఫలితం ఆశించకుండ కృషి ఎంతో చేసిన (2)
నడవడిలో రుజువు చేసి చూపిన ఈ సభ్యులకు ॥స్వాగతాలు॥

చరణం 3: సహకార సంఘాల కవచాలు మీరంతా (2)
రేపటి భవిష్యత్తు కొరకు బంగరు బాటలు వేసే (2)
మరచిపోని మరువరాని మార్గదర్శులైనారు (2)
అనునిత్యం సంఘసేవ జేసే ఈ పాలకులకు ॥స్వాగతాలు॥

చరణం 4: మన స్వకృషి సదస్సుకు విచ్చేసిన సభ్యులార (2)
సమస్యలు ఎన్నున్నా ఎదురీది చేదిద్దాం (2)
కలిసికట్టుగా నిలిచీ పొదుపుద్యమ సారథులై (2)
రథ చక్రములయ్యి పొదుపు ఉద్యమాన సాగిన ॥స్వాగతాలు॥

చరణం 5: ధనికా పేదా తేడా లేనీ భావం కలిగీ (2)
సహకార ఉద్యమంలో పవిత్రత కలిగుండీ (2)
మన స్వకృషి ఉద్యమంలో జయకేతన మెగరేసి (2)
జయహో పొదుపుద్యమమా జయము నీకు సంఘమా ॥స్వాగతాలు॥

# 24. స్వాగతాలూ స్వాగతాలూ

రచన : **శ్రీ కె లక్ష్మణ్**
వరంగల్

పల్లవి : స్వాగతాలూ స్వాగతాలూ
సహకార నాయకులకు స్వాగతాలూ ॥స్వాగతాలూ॥

చరణం 1: పొదుపు సంఘాల ప్రతినిధులకు నేడు
సహకార సదస్సుకు స్వాగతాలూ ॥స్వాగతాలూ॥

చరణం 2: కష్టజీవుల కష్టం ప్రోగయ్యింది
పొదుపు సంఘంగా ఆవిర్భవించెలే ॥స్వాగతాలూ॥

చరణం 3: స్వార్థమే శూన్యం నిస్వార్థమే పూర్ణం
పొదుపూ సంఘాలను కాపాడునులే ॥స్వాగతాలూ॥

చరణం 4: పొదుపులు చేసి, అప్పులు పొంది
మన ఆర్థిక అవసరాలు తీర్చుకుంటిమీ ॥స్వాగతాలూ॥

చరణం 5: కలవారికి భుక్తం కాకూడదు సంఘం
సమాజాన్ని వెలుగు నేడు ఆవరించెలే ॥స్వాగతాలూ॥

చరణం 6: వృద్ధాప్యంలో మార్గదర్శులమయ్యి
తోటి సభ్యులందరికాదర్శమైతిమీ ॥స్వాగతాలూ॥

చరణం 7: నిస్వార్థం నిరాపేక్ష సహకార భావనతో
స్వకృషీ ఉద్యమమూ సాగుతున్నదీ ॥స్వాగతాలూ॥

## 25. స్వాగతాలూ స్వాగతాలమ్మా ....

పల్లవి: స్వాగతాలూ స్వాగతాలమ్మా మా సాహోకారులు
పొదుపు ఉద్యమ ప్రాణాదాతలకు మా వందానాలు

చరణం 1: బయటి అప్పులు గుంజుక వచ్చీ వడ్డీ మీద వడ్డీ కట్టి (2)
భూమి నమ్మి ఇల్లూనమ్మీ ఒట్టి చేయితో బజార్న పడితే (2)
పల్లె జీవుల జీవితాలకూ మా సాహోకారులు
వెలుగు నింపిన కాంతీ దీపాలూ మా సాహోకారులు ॥స్వాగతాలూ॥


చరణం 2: కాలు చెయ్యీ ఆడిన నాడూ కొంత కొంత పొదుపూ చేసీ (2)
కొడుకు బిడ్డలు కాదన్ననాడూ నిల్వ నీడనిచ్చేనమ్మా (2)
పొదుపు ఉద్యమ ఊపిరైతిరీ మా సాహోకారులు
మరుపురాని ముద్రవేస్తిరి మా సాహోకారులు ॥స్వాగతాలూ॥

చరణం 3: బీద బిక్కీ బడుగు జీవులా జీవితాలకు వెలుగునిచ్చీ (2)
పొదుపు ఉద్యమ దారులు వేసీ పల్లె జీవుల ప్రాణాలైతిరీ (2)
జీవన ప్రమాణస్థాయికై మా సాహోకారులు
పొదుపుతోనే ప్రగతి అంటిరీ మా సాహోకారులు ॥స్వాగతాలూ॥

చరణం 4: నాడు చేసిన పొదుపులతోటీ నేటి బతుకుకు బంగారు బాటై (2)
ఎవరికి చేయి చాచకుండా తోడుగా మమ్ము నడిపించితిరీ (2)
బాధలన్నీ మోయూనేస్తమా మా సాహోకారులు
వెలుగునిచ్చిన వేగు చుక్కాలు మా సాహోకారులు ॥స్వాగతాలూ॥

చరణం 5: వయసు ఉడిగిన నాడూ మమ్మూ దిక్కులేనివారిని చేయక (2)
మార్గమూను చూపి మాకు మార్గదర్శకులైతిరమ్మ (2)
మీరు వేసిన దారులాలోన మా సాహోకారులు
మార్గదర్శిగా ముందు నడిపించు మా సాహోకారులు ॥స్వాగతాలూ॥

# స్వకృషి సహకార ఉద్యమ పరిధి




మహిళా పొదుపు సమితులు – 28

పురుషుల పొదుపు సమితులు – 20

ధాన్య విత్తన సంఘాలు – 2